# వ్యక్తిత్వం

అవధానుల సుధాకరరావు

తెల్లవారేందుకింకా అట్టే సమయం లేదు.

సుభద్ర మనసులోని సంచలనం చెప్పనలవి కాదు.

వెన్నెల రాత్రి కరిగిపోతూ వేగు చుక్క

పొడచూపుతూ, వేకువ కాబోతోంది.

జగతిని నిద్ర లేపేందుకై ఉదయ కిరణాలు సమాయత్తం అవుతున్నాయి.

ఆ రాత్రి సమయమంతా పగలుతో సమానం సుభద్రకి. ఒక్క క్షణం కూడా కన్ను మూతబడలేదు.

మనసులో ఆరాటం అటువంటిది.

సుదీర్ఘంగా భారంగా గడిచిన రెండేళ్ళ నిరీక్షణ- ముగింపుకొచ్చింది.

తెల్లవారితే- సూర్యుడొచ్చేస్తాడు...

తన బ్రతుకులో- ఉగాదులు, ఉషస్సులు...

అర్థాంతరంగా మోడు వారిన జీవితంలో మళ్ళీ ఆమని వసంతాలు... ఎలకోయిల తీపి పాటలు...

ఆ ఊహకే ఉత్తేజితురాలవుతోందామె.

దాదాపు పాతిక నెలలుగా తన ఉసురు పోసుకున్న అమావాస్య చీకట్లు పారిపోతూ పరారవుతున్నాయి.

ఆ స్థానంలో- వెన్నెలలు, పున్నమలు.

ముళ్ళదారిలోంచి పూలబాటలోకి జీవిత గమనం మళ్ళుతోంది. ఆ సంతోషం పట్టలేక హృదయం ఒకటే తుళ్ళిపడుతోంది.

ఇప్పుడు పాతికేళ్ళ పరువంలో వుంది తను.

ఇద్దరు పిల్లలు పుట్టినా శరీరంలో బిగువు అలాగే వుంది. ఆకర్షణ చెక్కు చెదరలేదు. అందం రెట్టింపయింది. కన్నె పిల్ల కంటే మిన్నగా శిల్పం లాంటి విగ్రహంతో మనసుని చలింపచేసే శక్తి వుంది తనలో

అయినా, తన భర్త... పొరుగింటి పుల్లకూర కోసం అర్రులు చాచేడు.

అందుబాటులో వున్న అమృతం కంటే- అందీ అందకుండా వుండే కషాయమే మనిషిని కవ్వించి, రెచ్చగొట్టి, అదే కావాలనిపించేలా చేస్తుంది.

సహజంగానే ఆయనకి స్త్రీ మోజు అధికం. అవకాశం దొరికినప్పుడల్లా కక్కుర్తిపట్టం తనకి తెలీంది కాదు. ఒక్కోసారి అతని విచ్చలవిడితనం నచ్చక నిలదీసి ప్రశ్నించబోతే- పరిహాసంగా నవ్వేసి, మీసం దువ్వుతూ... "ఇది మా జన్మహక్కు. పాతివ్రత్యం పాటించడం మీ వంతు..." అన్నాడు.

తన ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా అతని ఆటలన్నీ సాగిపోతున్నాయి.

ఎదురు చెప్పినా ఫలితముండదు కాబట్టి తను మూగనోము పట్టింది.

పవిత్రత, నీతి, నియమాలు స్వతహాగా అలవడాలి కాని, ఒకరు చెబితే బలవంత పెడితే అలవాటు చేసుకునేవి కావు.

రాజీ పడుతూ, ఎక్కడికక్కడ సర్దుకుపోతున్నా- తన వైవాహిక జీవితంలో సంక్షోభం తప్పలేదు.

ఇల్లాలిగా, గృహిణిగా గౌరవ స్థానంలో మనుగడ సాగిస్తున్న తనకి ఘోర విపత్తు ఎదురయింది.

అతని పరస్త్రీ వ్యామోహానికి పరాకాష్టగా ఆ ఊళ్ళోనే వున్న ఓ అయినింటి ఆడదాన్ని లేవదీసుకు పోయాడు. వారం రోజుల తర్వాత ఆమాకీ తెలిసింది. ఆమెతో 'నర్సంపేట'లో కాపురం పెట్టాడని.

నలుగురు పెద్ద మనుషులు కలిసి, వెళ్ళి అతడ్ని వెనక్కు తీసుకు రావడానికి చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు.

ఎవరు మాత్రం ఏం చేయగలరు?

ఒంటరితనంతో బలవంతంగా రోజులు నెట్టుకొస్తోంది తను.

నాన్న ఎటు వెళ్ళాడో, ఏమయ్యాడో తెలీక, అర్థం చేసుకునే శక్తి లేక పిల్లలు బెంగతో తల్లడిల్లుతూ వుంటే- తల్లయినందుకు తన కడుపు తరుక్కుపోయేది.

మనిషిమీదెంత కోపం వున్నా-

అతని చెడు ప్రవర్తనని ఎంత ద్వేషించినా-

రాత్రి సమయంలో, పక్క మీదకు చేరేసరికి శరీరం అతడ్ని జ్ఞాపకం చేసుకునేది.

వేళ ప్రకారం భోంచేస్తూ వుంటే 'ఆకలి' ఎలా తెలుస్తుంది...? ఇప్పుడు... ఇప్పుడు... వరుసగా రోజులు, వారాలు, నెలలూ గడచిపోతుంటే తన ఒళ్ళు విరహంతో వేడెక్కిపోతోంది.

ఒక్కటి మాత్రం నిజం.

వయసులో వున్న స్త్రీ పురుషులకి శారీరక సుఖం ఆవశ్యకం.

అసలు అనుభవంలో ప్రవేశం లేకపోతే ఏ బాధా లేదు. కాని తనలాంటి సాంసారిక స్త్రీల మాటో...? రక్తం రుచి మరిగిన చిరుతలా పొందు కోసం ఉవ్విళ్ళూరుతూ, కలయిక కోసం తపించిపోతూ...

ఒక్కోసారి నరాల్లోని ఉద్వేగాన్ని భరించలేక ఈ సాంప్రదాయాలకి తిలోదకాలొదిలి మగాడిలో ఐక్యమయిపోవాలన్న బలీయమైన వాంఛని అతి కష్టం మీద నిగ్రహించుకుంటుంది.

ఎలాగైతేనేం? ఏది ఏమైతేనేం...?

దేవుడు తన పక్షాన వున్నాడు.

తన మంచితనం, సహనం, ఓరిమి వృథా పోలేదు.

తన పూజలు ఫలించాయి.

తన జీవితం మళ్ళీ నిత్య నూతనంగా ప్రారంభమై పూర్వపు ఔన్నత్యాన్ని సంతరించుకోబోతోంది.

కళ్ళు మూసుకుపోయి, దారి తప్పిన తన భర్త - విలువ తెలుసుకొని తన దరికి చేరబోతున్నాడు.

నాన్నొస్తున్నాడు... ఈ వార్తకి కేరింతలు కొట్టారు పిల్లలు. తన అంతరంగం కూడా ఆయన రాకకి స్వాగతం పలుకుతోంది.

తెల్లవారితే.. ఆయన వచ్చేస్తాడు.

నిస్తేజం, నిరుత్సాహం... ఇక ఈ ఇంటి ఛాయల్లో వుండవు.

### క్వాలిఫైడ్-మేనేజర్


కంపెనీ మేనేజర్ పోస్టుకు ఇంటర్వ్యూ చేస్తూ ఛైర్మన్‌గారు అడిగారు,

"నీకు డాన్సు చేయడం వచ్చా?"

"అబ్బె రాదండీ, డాన్సు చేయించడం వచ్చు!"

"వెరీ గుడ్, అయితే రేపే మా కంపెనీలో జనరల్ మేనేజర్‌గా చేరండి.ఇక ఇంటర్వ్యూ అక్కర లేదు!"

— ఇ.వి. రమణ



పొంగి పొరలుతున్న ఆలోచనలు, మత్తెక్కే ఊహలతో కొత్త పెళ్ళికూతురులా వుందామె మానసం.

ఒకచోట నిలువలేక, కూర్చోలేక తనని తాను అదుపు చేసుకోలేక అవస్థపడుతూ చివరికి ఆరు బయటికొచ్చింది.

అతిశీతలంగా వున్న వాతావరణానికి ఒళ్ళు జివ్వు మంది.

గుడ్డిలో మెల్ల... అన్నట్టుగ్గా ఈ రెండేళ్ళ ఎడబాటు కాలంలో అత్తమామలు తనకి తల్లిదండ్రుల్లా మారి గుండెల్లో దాచుకోబట్టి కొంతవరకూ తట్టుకో గలిగింది.

అంతేకాదు.

"నువ్వేం భయపడకు తల్లీ! నీకు మేమున్నాం. మా తర్వాత కూడా వాడి బుద్ధి ఇలాగే వుంటే ఈ యావదాస్తికీ నువ్వే వారసురాలివవుతావు" వాళ్ళ ప్రేమానురాగాలు అలాంటివి.

తమదో సంపన్న వ్యవసాయ కుటుంబం.

ఇరవై ఎకరాల సుక్షేత్రమైన మాగాణి పొలం. ఏడాదికి మూడు పంటలతో లక్ష్మీదేవి తాండవిస్తుంది..

మామిడితోటలు, కూరగాయల పెంపకం. పాడి పశువులు... వీటన్నింటి మీద ఆశతోనైనా ఆయన ఎప్పటికైనా తిరిగొస్తాడని అందరూ అనుకుంటు న్నదే.

అది యదార్థమయిందిప్పుడు.

ఇక వెనుదిరిగి, ఇంట్లోకి వెళ్ళబోతున్న సుభద్రకి 'ఔట్ హౌస్'లోంచి మాటలు విన్పించాయి.

అది పెద్ద పాలేరు గోపాలం కోసం కేటాయించ బడిన వసతి.

"...నేను నీ మొగుడ్నే! నిన్ను మనువాడినోడ్ని!! నా దగ్గరకు రావడానికి జంకెందుకు? నన్ను దరి చేరడానికి బెదురుతున్నావెందుకు??" అనునయంగా, మెత్తగా పలికింది వాడి గొంతు.

విచిత్రం. ఒక్కోసారి సంఘటనల సమన్వయం ఎలా జరుగుతుందో!

గోపాలానికి ఈ మధ్యనే గౌరితో పెళ్ళయింది.

ఓ పట్నం కుర్రాడు ఏదో పని మీద ఆ పల్లె కొచ్చి దీపం లాంటి గౌరిని చూసి మోజుపడి- మాయ మాటలతో ఆమెని లేవదీసుకుపోయాడు.

ఏం జరిగిందో ఏమో హఠాత్తుగా రెండో రోజు రాత్రి పది గంటలకు గౌరి మళ్ళీ ప్రత్యక్షమయింది:

సమాధానంగా ఏడుపుతో కూడిన వెక్కిళ్ళు విన్పించేయి ముందు.

గుండె లోతుల్లోంచి ఎగదన్నుతున్న ఆ దుఃఖం- మనసుని కరిగించేలా వుంది.

"... ఒద్దు మావా!
నన్ను తాకొద్దు!! నేను
చెడిపోయ్యాను.
ఈ ఒళ్ళు ఎంగిలయి
పోయింది..."

"పిచ్చి గౌరి! ఏ తప్పు
చెయ్యకపోవడం కాదు
గొప్పతనం! తెలివి తెచ్చుకొని చేసిన తప్పు
తెలుసుకుని సరిదిద్దుకొనేవాడే నిజమయిన
మనిషి! జరిగిందేదో జరిగింది.
జీవితం అన్నాక ఇలాంటివి తప్పవే.
తప్పొప్పులకి ఆడ, మగ తేడాలుంటాయా...?
... ఇవాళ్టి నుంచి మనం కొత్తగా
కాపురం చేసుకుందాం. రా"

ఇంట్లోకి వెళ్ళినా కూడా ఆ సంఘటన, సంభాషణ సుభద్ర మనసులోంచి పోలేదు.

*　　*

ఉదయం 11 గంటలయింది. దర్జాగా, యువరాజులా జట్కా బండి లోంచి దిగేడు పురుషోత్తం. ఎదురెళ్ళిన పిల్లల్ని ఎత్తుకొని ముద్దుపెట్టుకున్నాడు. అమ్మ నాన్నల్ని పలకరించేడు. శుభద్రని చూపుల్తోనే ఒళ్ళంతా తడిమేడు. "...ఇక నేనొచ్చేసామగా! మీరంతా హాయిగా, ధీమాగా వుండండి. బాధ్యతలన్నీ నేను చూసుకుం

అన్నట్లు సుభద్రా- ఒకసారి లోపలికి రా..." అంటూ పడగ్గదిలోకి దారితీసేడు.

ఆమె లోపలకి రాగానే ఆత్రంగా కౌగలించుకో బోయాడు.

ఆమెక్కలిగిన అసహ్యం ఇంతా, అంతా కాదు. విదిలించి పారేసింది.

"ఏమిటిది?" అతనడిగేడు.

"నేను వేశ్యని కాదు..."

"కాని నా భార్యవి..."

"భార్య... ఆ విషయం ఈ రెండేళ్ళలో ఎప్పుడూ గుర్తుకు రాలేదా...?" సూటిగా ప్రశ్నించింది.

సుభద్ర కళ్ళ ముందు గతరాత్రి 'ఔట్‌హౌస్' సంఘటన కదిలింది.

గౌరి పశ్చాత్తాపంతో కరిగి నీరవుతూ భర్తని సమీపించడానికి ధైర్యం చాలక ఎంత సతమత మయింది!

కాని, ఈ పురుషుడు... తన భర్త అదే తప్పు చేయడమే కాక వచ్చీ రాగానే పట్టపగలు, నిర్లజ్జగా తనని పడగ్గదిలోకి పిలిచేడు పశువులా!

"ఎలా వున్నావు సుభద్రా! నిన్ను చాలా కష్ట పెట్టాను. ఇక మీద అలా జరగనివ్వను..." అంటూ పశ్చాత్తాపం ప్రకటించకుండా కామంతో ఆబోతులా తన మీద పడుతున్నాడు.

ఆమె 'వ్యక్తిత్వం' ఒక్కసారిగా వెయ్యిరెట్లు పెరిగింది.
గదిలోంచి బయటికొచ్చింది.

"...అత్తయ్యా, మామయ్యా! మీ అబ్బాయి వచ్చేసాడుగా! నాకిక శలవిప్పిస్తారా..?" స్థిరంగా పలికిందామె కంఠం.

ఆ ముసలి దంపతులు ఆదుర్దాగా, అయోమయంగా చూసారు.

"ఈ వ్యక్తి-నాకు తాళి కట్టిన భర్త కావొచ్చు. కాని రెండేళ్ళపాటు ఇంటిని, కన్నవాళ్ళని, పెళ్ళాం బిడ్డల్ని గాలి కొదిలేసి- అడ్డగాడిదలా చెడు తిరుగుళ్ళు తిరిగి- ఇల్లు చేరితే నేను వాడి కాళ్ళు కడిగి ఆ నీళ్ళు నెత్తిన చల్లుకునేంత పాతకాలం మనిషిని కాను.

మీ ఆస్తి కోసం, నా మీద మళ్ళీ పెరిగిన మోజుతోనూ మీ అబ్బాయి గూటికి చేరుకున్నాడు. అంతేకాని బాధ్యతలు తెలుసుకొని కాదు- జ్ఞానోదయం కలిగీ కాదు! నేను వెళ్ళిపోతాను. మీరంతా హాయిగా కలసి, బ్రతకండి..." అంటూ తొణక్కుండా తన నిర్ణయం చెప్పింది.

"అవసరం లేదమ్మా..." అంటూ ఆమె మామగారు ఖంగున పలికి-

"ఒరేయ్ పురుషోత్తం! తక్షణమే నువ్వు వచ్చిన దారినే వెళ్ళిపో!

ఈ ఇంటితో నీకే సంబధమూ లేదు. నువ్వు మాకేమీ కావు.

సుభద్రంటే గర్భగుడిలోని దేవతామూర్తి రా!

నువ్వు- ఆ గుడి బయటే వదిలే చెప్పువి!!

వెంటనే కదులిక్కడ్నుంచి- నీ మొహం చూస్తేనే పంచ మహా పాతకాలు చుట్టుకుంటాయి..." సుభద్ర అప్రతిభురాలై శిలా ప్రతిమలా నిలబడి వుండగా- ఆమెకి చెరో ప్రక్కనా బిక్కు, బిక్కుమంటూ తల్లిని కరుచుకుని నిలబడి వున్నారు ఓ చిన్నారి పాప, బాబు.

పురుషోత్తం ఆ పరిసరాల్లోంచి వెళ్ళిపోతూ వుంటే- భరించలేని దుర్వాసన దూరమవుతున్నట్లు అందరి మనసులకీ హాయిగా అన్పించసాగింది.

అతని నిష్క్రమణకి పరవశిస్తూ కొమ్మల్లోంచి కోయిల కూడా రాగాలు తీస్తోంది.

### బూడిద చేస్తున్నాను

విఠల్‌భాయ్ పటేల్ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులలో ఒకరు. అవి స్వదేశీ ఉద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజులు. ప్రజలందరు బ్రిటిష్ వస్తువులని విసర్జించి కేవలం భారత దేశంలో తయారైన వస్తువులని మాత్రమే ఉపయోగిస్తున్నారు.

విఠల్‌భాయ్ పటేల్ మాత్రం ఇంగ్లండ్‌లో తయారైన సిగరెట్‌లు కాల్చడం మానలేదు.

ఒక స్నేహితుడు పటేల్‌ని ఆ విషయం అడగగా అతనీ విధంగా సమాధానమిచ్చాడు "కనపడడం లేదూ! నేను ఇంగ్లండ్‌లో తయారైన సిగరెట్‌ని బూడిద చేస్తున్నాను"

- మొండెపు నాని, రాజమండ్రి.

